సాక్షి
మెదక్
మంగళవారం । 1 । జూలై । 2025





పరిశ్రమ ఎదుట రోదిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ఆర్తనాదాలు.. హాహాకారాలు

పాశమైలారంలో భారీ పేలుడు ● మరుభూమిగా ఘటనా స్థలం

సిగాచీ పరిశ్రమ ఎదుట భీతావహం ● తమ వారి ఆచూకీ కోసం విలపించిన బాధిత కుటుంబ సభ్యులు

వారంతా రోజు మాదిరిగానే విధుల్లోకి వచ్చారు. తమ తోటి కార్మికులు, ఉద్యోగులకు శుభోదయం చెప్పుకున్నారు. అప్పుడప్పుడే ఎవరికివారు తాము పని చేసే స్థలాల్లో నిమగ్నమవుతున్నారు. ఒక్కసారిగా మృత్యువు పేలుడు రూపంలో కబళించింది. ఉన్నపళంగా అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. పొగ పూర్తిగా కమ్ముకోవడంతో చుట్టూ చీకటి. అగ్నికీలలకు దేహాలు ఆహుతైపోయాయి. శరీరభాగాలకు మంటలు అంటుకున్నాయి. మరికొందరి శరీరాలు మాడి మసైపోయాయి. ఎటు చూసినా హాహాకారాలు. ప్రమాదం నుంచి బయటపడేందుకు ఆర్తనాదాలు.. సిగాచీ పరిశ్రమల్లో రియాక్టర్ పేలిన ఘటనకు సంబంధించి భీతావహ వాతావరణం ఇది. ఎక్కడపడితే అక్కడ కార్మికుల శవాలు. కాలి బూడిదై.. మసైపోయిన శరీర భాగాలు. ఇలా పేలుడు జరిగిన ప్రదేశం పూర్తిగా మరుభూమిని తలపించింది.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఉపాధి కోసం వస్తే ఏకంగా ఉసురే తీసేసింది సిగాచీ పరిశ్రమ. సోమవారం ఈ కంపెనీలో జరిగిన విస్ఫోటనం బతుకుదెరువుకోసం వలస వచ్చిన వారి జీవితాలను బుగ్గిపాలు చేసింది. పేలుడు ధాటికి దూరంగా ఎగిరిపడ్డ కార్మికుల మృతదేహాలతో..చిద్రమైన శరీరభాగాలతో, కూలిన శిథిలాలతో సిగాచీ మరుభూమిని తలపించింది. తమ వారి ఆచూకీ కోసం బాధితుల ఆక్రందనలు, క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం భీతిల్లింది. ఈ పారిశ్రామికవాడలో కార్మికుల కుటుంబాలు కోల్పోతున్నా పరిశ్రమ యాజమాన్యానికి మాత్రం సాధారణమేనని తరచూ జరిగే ప్రమాదాలు నిరూపిస్తూనే ఉన్నాయి. అనుభవాలు, ప్రమాద పాఠాల నుంచి యాజమాన్యాలు, ప్రభుత్వాలు గుణపాఠం నేర్వవని మరోసారి ఈ ప్రమాదంతో రుజువైంది. సోమవారం ఉదయం జరిగిన రియాక్టర్ పేలుడు ఘటన ఆ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది.

పారిశ్రామిక వాడలో విషాదం

ఉదయమే తమ ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్లిన కొద్ది సేపటికే ప్రమాదం జరిగినట్లు సమాచారం తెలుసుకున్న బాధిత కార్మికుల కుటుంబసభ్యుల ఆవేదన అంతా ఇంతా కాదు. కుటుంబ సభ్యుల ఆచూకీ లభించకపోవడంతో కార్మికుల కుటుంబసభ్యుల ఆక్రందనలు మిన్నంటాయి. తమ వారు ఏమయ్యారో తెలియకపోవడంతో వారు అధికారుల చుట్టూ తిరిగారు. అక్కడి నుంచి స్పందన లేకపోవడంతో కన్నీరు మున్నీరయ్యారు. దీంతో పాశమైలారం పారిశ్రామికవాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన బాధిత కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. కాలినగాయాలతో బాధపడుతున్న తమ ఆత్మీయులను చూసి బోరున విలపించారు. కళ్లముందే విగత జీవులుగా మారిన తమ వారిని చూసి కన్నీరు మున్నీరుగా రోదించారు. తమ వారి జాడ ఎక్కడైనా లభిస్తుందేమోనని ఎదురు చూస్తున్నారు.



ఉపాధి కోసం వచ్చి అనంత లోకాలకు..

వారంతా పొట్ట చేతబట్టుకుని వచ్చిన నిరుపేద కుటుంబాలే. ఉపాధి కోసం వందల కిలోమీటర్ల నుంచి వచ్చిన కార్మికులే అధికం. బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి రాష్ట్రాల నుంచి భార్యాబిడ్డలతో వచ్చి ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. చాలీచాలని జీతాలున్నప్పటికీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈ కార్మికుల కుటుంబాల్లో ఈ పేలుడు ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. పొట్ట చేతబట్టుకుని వచ్చిన తమ వారిని మృత్యువు కబళించడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఉపాధి కోసం వస్తే ఉసురే పోయిందని విలపిస్తున్నారు. ఘటన జరిగి గంటలు గడుస్తున్నా తమ వారి ఆచూకీ లభించకపోవడంతో వారు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



చెల్లాచెదురైన మృతదేహాలు



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తూ..



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తూ..

సొంత ఖర్చులతో ఆస్పత్రికి తరలింపు

పటాన్‌చెరు: పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ పరిశ్రమలో సోమవారం ఉదయం జరిగిన పేలుడు ప్రమాదంలో గాయపడిన క్షతగ్రాతుల్లో కొంతమందిని వారి కుటుంబసభ్యులే సొంత ఖర్చులతో పలు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకోగాగాయపడ్డ కార్మికులను చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించేందుకు పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం చూసి కుటుంబసభ్యులే అంబులెన్స్‌లకు డబ్బులు చెల్లించి తమవారిని ఆస్పత్రులకు తరలించడం మరో విషాదం.



తీవ్ర గాయాలపాలైన కార్మికురాలిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది



సహాయక చర్యల్లో డీఆర్‌ఎఫ్..

అప్పుడే మేల్కొనుంటే..

- నాడు ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలి ఆరుగురు మృతి..
- ఇదే తరహాలో ఇప్పుడు సిగాచీ పరిశ్రమలో ఘటన..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: గతేడాది మార్చిలో సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలి ఆరుగురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ఈ పేలుడు ధాటికి చుట్టుపక్కల భవనాలు సైతం శిథిలమయ్యాయి. ఈ ఘటనలో అమాయక కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోగా 30 మంది క్షతగాత్రులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ భారీ ఘటనతోనైనా సంబంధిత అధికారులు మేల్కొని ఉంటే..ఇప్పుడు ఇలా సిగాచీ పరిశ్రమలో భారీ పేలుడు ఘటన పునరావృతం అయ్యేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎస్‌బీ ఆర్గానిక్స్ ప్రమాదం జరిగినప్పుడు అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి ప్రమాణాలు పాటించాలి.. ఎలాంటి భద్రతాపరమైన చర్యలు చేపట్టాలనే దానిపై కమిటీ నివేదిక ఇచ్చింది. అయితే ఈ కనీసం నిబంధనలు పాటించకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయి.

కీలకపని ప్రదేశాల్లో స్కిల్డ్ లేబర్ లేక..

పరిశ్రమల్లో కీలక పని ప్రదేశాల్లో స్కిల్డ్ లేబర్‌తో పనిచేయించాలి. ముఖ్యంగా రియాక్టర్లు, బాయిలర్లు, బ్లోయర్లు, ఇలా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సంబంధిత అంశాల్లో అన్ని అర్హతలున్నవారికి విధులను అప్పగించాలి. కానీ, తక్కువ వేతనాలకు పనిచేస్తారనే కారణంగా ఇలాంటి కీలక ప్రదేశాల్లో అన్‌స్కిల్డ్ కార్మికులతో పనులు చేయించడంతో ఇలాంటి ప్రమాదాలకు దారితీస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాసులకు కక్కుర్తి పడుతున్న పరిశ్రమల యాజమాన్యాలు ఇలా కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు ఏవీ..

పరిశ్రమల్లో కనీస భద్రతా ప్రమాణాలను పాటించేలా ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. కానీ, ఈ తనిఖీలు జిల్లాలో మొక్కుబడిగా జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. ఆయా పరిశ్రమల నుంచి ప్రతినెలా ఠంఛనుగా మామూళ్లు పొందుతున్న ఈ శాఖ అధికారులు పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పాటించకపోయినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమ ప్రమాదానికి కొద్దిరోజుల ముందే ఇదే హత్నూర మండలంలో కోవాలెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు మృత్యువాత పడ్డారు. ఇలా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నప్పటికీ.. సంబంధిత అధికారుల్లో కనీసం చలనం లేకుండా పోయింది.

ప్రమాదం జరిగాక హడావుడి

సంబంధిత అధికారులు ఇలా ప్రమాదం జరిగాక హడావుడి చేస్తున్నారే తప్ప ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ఎస్‌బీఆర్గానిక్స్ భారీ పేలుడు ఘటన జరిగిన కొన్ని రోజులకే ఇప్పుడు సిగాచీ పరిశ్రమలో అంతకుమించి భారీ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పదుల సంఖ్యలో కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ప్రభుత్వం ఇకనైనా స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

నా గోడు పట్టదా?



మధ్యప్రదేశ్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చి ఇక్కడ ఉంటున్నాం. నా భర్త చోటేలాల్ సిగాచీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఉదయం యథావిధిగా డ్యూటీకి వెళ్లాడు. వెళ్లిన కొద్దిసేపటికే పరిశ్రమలో ప్రమాదం జరిగిందని తెలిసింది. నా భర్త ఎక్కడున్నాడో తెలియడం లేదు. అతడి ఆచూకీ చెప్పాలని అధికారులను అడుగుతున్నా నాగోడు ఎవరూ పట్టించుకోవడం లేదు.

–సంజు దేవి, స్వస్థలం మధ్యప్రదేశ్

నా భర్త ఎక్కడ?



ఒరిస్సా నుంచి బతుకుతెరువు కోసం మూడేళ్ల క్రితం వచ్చి ఇస్నాపూర్‌లో ఉంటున్నాం. అప్పట్నుంచీ నా భర్త ప్రసాద్ మహాపాత్ర సిగాచీ పరిశ్రమలో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. వెళ్లిన కొద్దిసేపటికి ప్రమాదం జరిగిందని తెలిసింది. వెంటనే పరిశ్రమ వద్దకు వచ్చాను. నా భర్త ఆచూకీ తెలియడం లేదు.

–సోనాలి మహాపాత్ర

ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది



నా భర్త నాగేశ్వరరావు పదేళ్లుగా ఈ కంపెనీలో క్వాలిటీ సెల్ విభాగంలో పనిచేస్తున్నాడు. పటాన్‌చెరులో నివాసం ఉంటాం. రోజులాగే సోమవారం ఉదయం డ్యూటీకి వెళ్లాడు. వెళ్లిన గంటల వ్యవధిలో పరిశ్రమల ప్రమాదం జరిగిందని తెలిసింది. వెంటనే నా భర్తకు ఫోన్ చేస్తుంటే స్విచ్ఛాఫ్ వస్తోంది. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడికి వచ్చాం. నా భర్త ఆచూకీ ఇంకా తెలియలేదు.

–హేమలత, పటాన్ చెరు

ఆచూకీ తెలియడం లేదు



రోజు మాదిరిగానే ఉదయం నా భర్త బాలకృష్ణ డ్యూటీకి వెళ్లాడు. విషయం తెలిసి వెంటనే కుటుంబ సభ్యులతో కలిసి ఇక్కడకు వచ్చాం. తన భర్త ఆచూకీ తెలియడం లేదు. ఎవరిని అడిగినా చెప్పడంలేదు. లోపలికి రానివ్వడం లేదు.

–మల్లీశ్వరి, ముత్తంగి



కాలిన గాయలతో కార్మికుడు



బాధితురాలితో మాట్లాడుతున్న హరీశ్‌రావు

పోలీసుల ఓవరాక్షన్

బాధిత కుటుంబాల పట్ల దురుసు ప్రవర్తన



పటాన్‌చెరు: 'నా భర్త ఎక్కడ'అంటూ కొందరు మహిళలు గుండలవిసేలా విలపించారు. ఓ మహిళ మాట్లాడుతూ తన భర్త పేరు ఆస్పత్రిలో చేరిన వారి జాబితాలో లేదు. చనిపోయిన వారి జాబితాలో కూడా లేదని చెబుతున్నారు. మరి ఎక్కడున్నారు..? చెప్పాలి అంటూ బాధితులు తమ వారి ఆచూకీ కోసం కలియదిరుగుతుంటే లోపలికి రాకూడదంటూ పోలీసులు వారి పట్ల అమానవీయంగా దురుసుగా వ్యవహరించారు. అనిత, సంజీవ్‌లాల్ అనే మహిళలు పోలీసులతో వాదిస్తూ పోలీసులపై రాయి ఎత్తి పట్టి తిట్టిపోశారు. ఉదయం ఇంట్లో నుంచి వెళ్లిన మావాళ్లు ఇంటికి తిరిగి రాలేదు. పొద్దున్నుంచి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నా..అని ఓ మహిళ వాపోయింది. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన విస్ఫోటనంలో చనిపోయిన, గాయపడిన వారి కుటుంబీకుల పరిస్థితి ఇది.

యాజమాన్య నిర్లక్ష్యంతోనే ప్రమాదం

- మృతుల కుటుంబాలకు రూ.కోటి, క్షతగాత్రులకు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి
- ఒకరికి ఉద్యోగం కల్పించాలి
- అధికారులతో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గూడెం



ఘటన స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ

పటాన్‌చెరు టౌన్: యాజమాన్యం నిర్లక్ష్యం..ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తూతూ మంత్రంగా చేపట్టే తనిఖీల మూలంగానే సిగాచి ఫార్మా పరిశ్రమలో పేలుడు ఘటన చోటుచేసుకుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మరణించిన ప్రతీ కార్మికుడి కుటుంబానికి రూ.కోటి, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, క్షతగాత్రలకు మెరుగైన వైద్యంతోపాటు రూ.50లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం రియాక్టర్ పేలుడు జరిగిన విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన ఘటనాస్థలికి ఎమ్మెల్యే గూడెం చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా డీఐజీ ఇక్బాల్, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోశ్ పంకజ్‌తో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 30 ఏళ్లుగా పరిశ్రమ నడిపిస్తున్న సిగాచి యాజమాన్యం ఎన్నడూ కార్మికుల భద్రత కోసం చర్యలు తీసుకోలేదన్నారు. గతంలో కూడా ఇదే పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి పెద్ద సంఖ్యలో మృతి చెందారని గుర్తు చేశారు. ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సిన పరిశ్రమల తనిఖీల విభాగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికుల భద్రతను గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించి పూర్తిస్థాయిలో విచారణ జరిపించి..ఘటనకు కారకులైన యాజమాన్యం, నిర్లక్ష్యం వహించిన పరిశ్రమ విభాగం అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

ఆపరేషన్ ముస్కాన్‌ను విజయవంతం చేద్దాం

మెదక్‌మున్సిపాలిటీ: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు ఎస్పీ మహేందర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంబంధిత అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ ముస్కాన్ కొనసాగుతుందని తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమో దు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు.

చేతకాని సర్కారుకు బుద్ధి చెప్పాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామాల్లో చెత్తను తొలగించడం చేతకాని ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. చెత్త ట్రాక్టర్లు నడపకపోవడం, మురికి కాలువలు శుభ్రం చేయకపోవడం, వీధి దీపాలు వెలగకపోవడం, పారిశుద్ధ్యం లోపించడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కేసీఆర్ హయాంలో పల్లె ప్రగతి ద్వారా పల్లెలు శుభ్రంగా ఉండగా, నేడు కనీసం ట్రాక్టర్లలో డీజిల్ పోయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. డీజిల్ పోయలేమని పంచాయతీ కార్యదర్శులు అంటే మెమోలు ఇస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు మేమెందుకు డబ్బులు ఇస్తామని మంత్రి సీతక్క చెప్పడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. ఈ పాలనపై 18 నెలలకే ప్రజలకు విరక్తి వచ్చిందన్నారు. అనంతరం ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, మాజీ ఎంపీపీ రాజు, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, నాయకులు మహిపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కాంతారావు పాల్గొన్నారు. అనంతరం మహ్మద్‌నగర్ గేట్ వద్ద సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు.



చెత్త డబ్బాలతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

అర్జీలను తక్షణం పరిష్కరించాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణి అర్జీలకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలపై 97 దరఖాస్తులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

- ఇద్దరు కొడుకులకు సమానంగా ఇల్లు పంచి ఇచ్చాను. కాని పెద్ద కొడుకు, చిన్న కొడుకుకు వాటా ఇవ్వడం లేదు. అలాగే నా బాగోగులు చూడటం లేదు. అడిగిన వారిపై దాడికి పాల్పడుతున్నాడు. న్యాయం చేయాలని కోరుతూ అల్లాదుర్గం మండలం చిల్వర గ్రామానికి చెందిన వంజరి నర్సింలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- పెద్ద కూతురు భర్త చనిపోగా, ఇంట్లో ఉంచుకొని ఆసరా కల్పించాను. ఆలనా పాలనా చూస్తుందనుకున్నాను. కాని అక్రమంగా నా రెండు ఎకరాల భూ మి రాయించుకొని ఆగం చేస్తుంది. వెన్నుపూస విరిగి తీవ్ర అనారోగ్యంతో ఉన్న నన్ను పట్టించుకోవడం లేదని శివ్వంపేట మండలం పిలుట్లకు చెందిన పెద్ద గంగమ్మ ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరింది.
- తాతల తరం నుంచి కాస్తులో ఉన్న భూమిని ఆక్రమించుకుంటూ తమను బెదిరిస్తున్నారని హవేళిఘణాపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన బాధితులు వాపోయారు.



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆకలితో అలమటిస్తున్నా..



పక్షవాతంతో బాధపడుతున్నా.. తన బాగోగులు చూస్తారన్న ఆశతో ఉన్న అర ఎకరం ఇద్దరు కొడుకుల పేర రాశాను. కాని వారు నా ఆలనా పాలన చూడటం లేదు. అన్నం పెట్టకపోవడంతో అర్ధాకలితో అలమటిస్తున్నాను. తన భూమి తనకు ఇప్పించి ఆదుకోవాలని చేగుంట మండల కేంద్రానికి చెందిన పోచమ్మల లింగమ్మ కలెక్టర్‌ను వేడుకుంది.

క్లుప్తంగా

డ్రగ్స్‌పై నిఘా పెంచాలి
సీపీ అనురాధ


మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: గంజాయి, డ్రగ్స్‌, ఇతర మత్తు పదార్థాలపై నిఘా పెంచాలని సీపీ అనురాధ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీసు కమిషనరేట్‌లో పెండింగ్‌ కేసులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. ఆత్మహత్యలకు గల కారణాలు గుర్తించి నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులతో కలిసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డయల్‌ 100 కాల్స్‌పై అలసత్వం వహించవద్దన్నారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ కేసులలో 60రోజుల్లో ఇన్వెస్టిగేషన్‌ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేయాలన్నారు. సమావేశంలో ఏఆర్‌ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్‌, ఏసీపీలు రవీందర్‌రెడ్డి, నరసింహులు, సదానందం, రవిందర్‌, శ్రీనివాస్‌, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్లు శ్రీధర్‌గౌడ్‌, కిరణ్‌, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్‌, విద్యాసాగర్‌, శ్రీను, దుర్గ, ప్రవీణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత
రామచంద్రాపురం (పటాన్‌ చెరు): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శ్రీధర్‌ మాలిక్‌ జీవనోపాధి కోసం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరుకు వలస వచ్చాడు. ఇక్కడ లేబర్‌ క్యాంపులో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. డబ్బు సంపాదించాలనే ఆశతో తన గ్రామం నుంచి గంజాయి తీసుకొచ్చి లేబర్‌ క్యాంపులో అమ్ముతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి నిందితులకు జైలు
జహీరాబాద్‌ టౌన్‌: గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా అదనపు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. జహీరాబాద్‌ ఎక్సైజ్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా గంపవరానికి చెందిన పవన్‌ కుమార్‌ (36), అనిమేష్‌ మండల్‌ (26) 10 కిలోల ఎండు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుండగా 2019లో పోలీసులు పట్టుకున్నారు. అప్పట్లో ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్‌ చేశారు. జిల్లా అదనపు కోర్టులో వాదనలు జరిగిన అనంతరం జడ్జి సోమవారం నిందితులకు ఐదేళ్ల శిక్షతోపాటు రూ. 25 వేల జరిమానా విధించారు.

వృద్ధురాలిని నమ్మించి.. చైన్‌ స్నాచింగ్‌


లలిత

తూప్రాన్‌: వృద్ధురాలి మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసు అపహరించుకుపోయిన ఘటన మున్సిపల్‌ పరిధిలోని పడాల్‌పల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చెప్యాల లలిత (68) కొందరు మహిళలతో కలిసి పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షలకు వచ్చింది. తిరిగి గ్రామానికి వెళ్లేందుకు ఆటో స్టాండు వద్ద నిలుచుంది. ఈ క్రమంలో ఓ యువకుడు వచ్చి 'అమ్మ ఇక్కడ ఉన్నవా.. మీ కోసం మీ ఇంటికి వెళ్లాను. అక్కడ మీరు లేరు. మీకు పింఛన్‌ వచ్చింది' అని నమ్మబలికాడు. రెండు పాస్‌ ఫొటోలు, ఆధార్‌ కార్డు కావాలని అడిగాడు. వృద్ధురాలు ఆ యువకుడి మాటలు నమ్మి ఫొటోలు లేవని తెలిపింది. ఆధార్‌కార్డుపై ఉన్న ఫొటోను చూసి ఇందులో నీ మెడలో నగలు లేవు.. ఫొటో తీయించుకువస్తాను నీ మెడలోని గొలుసు ఇవ్వమని అడిగాడు. దీంతో నమ్మిన వృద్ధురాలు ఆధార్‌కార్డుతో పాటు గొలుసు ఇచ్చింది. అవి తీసుకెళ్లిన యువకుడు ఎంతకు తిరిగిరాకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిద్దుబాటేది?

పారిశ్రామికవాడల్లో ప్రమాదాలు అరికట్టే చర్యలు శూన్యం


పరిశ్రమ బయట బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు

పటాన్‌చెరు: మనం అనుకోకుండా జరిగేవే ప్రమాదాలు..జీవితంలో ఎదురైన అనుభవాలు, ప్రమాదాల నుంచి మనం ఏదోక గుణపాఠం నేర్చుకుంటుంటాం. అయితే పటాన్‌చెరు పారిశ్రామిక వాడలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పరిశ్రమల యాజమాన్యాలు గుణపాఠం నేర్వడం లేదు. పాశమైలారంలో సిగాచీ పరిశ్రమలో సోమవారం జరిగిన ప్రమాదంలో శ్రమజీవులు పిట్టల్లా రాలి పోయిన ఘటనే అందుకు నిదర్శనం.

కార్మికులంతా ఔట్‌సోర్సింగే...

సిగాచీలో కార్మికులందరూ ఔట్‌సోర్సింగ్‌ వారే కావడం విశేషం. కార్మికులకు తాము చేస్తున్న పనికి వేతనం వస్తే చాలనే పరిస్థితి నెలకొంది. బిహార్‌, ఒడిశా రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చి ఇక్కడ పరిశ్రమల్లో పని చేయిస్తున్నారు. ప్రమాదకర యంత్రాలపై ఏమాత్రం నైపుణ్యం లేని అన్‌స్కిల్డ్‌ లేబర్‌తో పని చేయిస్తున్నారు. అదే మంటే నిపుణుల కొరత ఉందని స్థానికులెవరూ పరిశ్రమల్లో పని చేసేందుకు ముందుకు రావడం లేదని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. కారణాలు ఏమైనా పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల వివరాలేవీ ప్రభుత్వ యంత్రాంగం వద్ద ఉండటం లేదు. ఒక వేళ ఉన్నప్పటికీ అవన్నీ తప్పుడు నివేదికలే అయి ఉంటున్నాయి. అధికారుల తనిఖీలు కూడా సరిగ్గా చేయడం లేదని తెలుస్తోంది.

గతంలో జరిగిన ప్రమాదాలివే..

ఇదే పరిశ్రమలో 2002లో ప్రమాదం జరిగింది. అప్పుడు ఒకరు మృతి చెందారు. తర్వాత ఏరిస్‌లో భారీ ప్రమాదం జరిగి కార్మికులు మృతి చెందారు. పాశమైలారంలో చైతన్య క్లోరైడ్స్‌, రాంటస్‌ పరిశ్రమలో భారీ ప్రమాదాలు జరిగాయి. రాంటస్‌లో జరిగిన ప్రమాదంలో మంటలార్పిన మూడు రోజులకు ముగ్గురు కార్మికుల మృతదేహాలు పూర్తిగా కాలిపోయి కనిపించాయి. ఇక జయవిజయ అల్లాయిస్‌ పరిశ్రమలో జరిగిన పేలుడు ప్రమాదంలో అక్కడికక్కడే ఆరు మంది కార్మికులు చనిపోయారు. వీరుపాక్ష రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు మృతి చెందారు. 2023లో గడ్డ పోతారంలో మైలాన్‌ పరిశ్రమలో రసాయన డ్రమ్ములు పేలిన ఘటనలో ముగ్గురు కార్మికులు చనిపోయారు. తర్వాత లీ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఈ ఏడాదిలోనే పాశమైలారం ఎంఎస్‌ఎన్‌లో ప్రమాదం జరిగింది. ఇలా ప్రతీసారి ఏదో ఒక పరిశ్రమలో ఏదో ఒక ప్రమాదం కార్మికులను పొట్టనబెట్టుకుంటోంది. కొన్ని పరిశ్రమల్లో అయితే జరిగిన ప్రమాదాలు సైతం వెలుగులోకి రావడం లేదు. చనిపోయిన వారి కుటుంబసభ్యులు కూడా ఇక్కడ అందుబాటులో ఉండకపోవడంతో పరిశ్రమల యాజమాన్యానికి కలిసివస్తోంది. మృతుల కుటుంబాలకు సదరు కాంట్రాక్టర్‌ ద్వారా ఎంతోకొంత సొమ్మును ముట్టజెప్పి వారి నోళ్లను నొక్కేస్తున్న ఘటనలు కోకొల్లలు.


సిగాచీ పరిశ్రమలో ఎగిసిపడుతున్న మంటలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ నాగిరెడ్డి తదితరులు

సెంట్రల్‌ బ్యాంకులో చోరీకి యత్నం

- గోడకు కన్నం చేసి లోనికి వచ్చిన దుండగులు
- అలారం మోగడంతో పరారీ


బ్యాంక్‌ వెనకవైపు స్టోర్‌ రూంకు దుండగులు చేసిన కన్నం

వెల్దుర్తి(తూప్రాన్‌): బ్యాంకులో చోరీకి యత్నించి అలారం మోగడంతో దుండగులు పరారయ్యారు. ఈ ఘటన మండల కేంద్రంలోని అంబేద్కర్‌ చౌరస్తా వద్ద ఉన్న సెంట్రల్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... ఆదివారం అర్ధరాత్రి సుమారు 1.30 గంటలకు బ్యాంక్‌ వెనకవైపు స్టోర్‌ రూం గోడకు కన్నం చేసి ఇద్దరు దుండగులు లోపలికి ప్రవేశించారు. ఈ క్రమంలో బ్యాంకును అనుక్షణం పర్యవేక్షించే ఐవీఎస్‌ టీం అలర్ట్‌ అయి అలారం మోగడంతో దుండగులు గోడకు వేసిన కన్నం ద్వారా పరారయ్యారు. అదే సమయంలో డయల్‌ 100 ద్వారా పోలీసులను అలర్ట్‌ చేయడంతో తూప్రాన్‌ డీఎస్పీ నరేందర్‌ గౌడ్‌, క్లూస్‌ టీం, బ్యాంక్‌ మేనేజర్‌ సుమన్‌ భాగే, సిబ్బందితో ఘటనా స్థలాన్ని సందర్శించి వేలిముద్రలు సేకరించారు. నిందితులిద్దరూ ముఖానికి మాస్కులు ధరించినట్లు తెలిసింది. చోరీలో ఇద్దరు దుండగులే పాల్గొన్నారా? లేక బయట ఎవరైనా కాపలాగా ఉన్నారా? వంటి వివరాలు తెలియాల్సి ఉంది. డీఎస్పీ వెంట తూప్రాన్‌ సీఐ రంగాకృష్ణ, వెల్దుర్తి ఎస్సై రాజుతో పాటు మనోహరాబాద్‌, శివంపేటకు చెందిన పోలీస్‌ సిబ్బంది ఉన్నారు. గతంలో కూడా ఓ యువకుడు చోరీకి ప్రయత్నించగా సీసీ కెమెరాల ద్వారా గుర్తించి కేసు నమోదు చేశారు.

సెల్ఫీ తీసుకుంటూ ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న సుధాకర్‌

శివ్వంపేట(నర్సాపూర్‌) : వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... శభాష్‌ పల్లి గ్రామానికి చెందిన పానగారి సుధాకర్‌(28) ఆదివారం భార్యాపిల్లలను కొత్తపేట గ్రామంలో అత్తగారి ఇంటి వద్ద దింపాడు. అక్కడి నుంచి బైక్‌పై నర్సాపూర్‌కు వెళ్లి ఓ ఫర్టిలైజర్‌ దుకాణంలో పురుగుల మందు కొనుగోలు చేశాడు. రుస్తుంపేట గ్రామ శివారులో పురుగుల మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. నేను తప్పు చేయలేదు నా పిల్లలు దూరమవుతున్నారంటూ సెల్ఫీ వీడియోను తన స్నేహితుడికి వాట్సప్‌ చేశాడు. అతడు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. శివ్వంపేట పోలీసుల సహకారంతో లొకేషన్‌ ఆధారంగా కుటుంబ సభ్యులు వెళ్లేలోపు గుర్తించిన స్థానికులు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇది ఇలా ఉండగా సుధాకర్‌ నాలుగేళ్ల క్రితం గ్రామంలో జరిగిన పోక్సో కేసులో నిందితుడిగా ఉన్నాడు. కేసు ట్రయల్‌కు రావడంతో శిక్ష పడుతుందన్న ఉద్దేశంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తుంది.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య


కిరణ్‌

శివ్వంపేట(నర్సాపూర్‌): యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దాసరి వీరమణి, నర్సింహులు దంపతుల పెద్ద కొడుకు దాసరి కిరణ్‌(22) ప్రైవేటు పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి

సంగారెడ్డి క్రైమ్‌: కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రమేష్‌ వివరాల ప్రకారం... సోమవారం ఉదయం 9 గంటల సమయంలో పట్టణంలోని రుక్మిణి థియేటర్‌ వద్ద గల డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గమనించి మేనేజర్‌ వెంకటేశం పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో పట్టణంలోని విజయ్‌నగర్‌ కాలనీకి చెందిన కడమంచి దుర్గాప్రసాద్‌ (23)గా గుర్తించారు. ఇతడు వృత్తిరీత్యా కూలీ పనులు చేసుకుంటున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి..


షరోని

జహీరాబాద్‌ టౌన్‌: చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఝరాసంగం మండలం బిడకన్నె గ్రామానికి చెందిన లక్ష్మణ్‌ కుటుంబంతో జహీరాబాద్‌ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. జూన్‌ 22న ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో లక్ష్మణ్‌ రెండవ కుమార్తె షరోని(7) గాయపడింది. ప్రమాదవశాత్తు దీపం చిన్నారిపై పడి మంటలు అంటుకున్నాయి. కుటుంబ సభ్యులు చూసి మంటలను ఆర్పేలోపు గాయాలయ్యాయి. సంగారెడ్డిలోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది.

ఓవర్‌టేక్‌ చేయబోయి..

- బస్సును ఢీకొట్టిన ఆటో
- ఇద్దరు యువకుల దుర్మరణం


నరేశ్‌


శ్రీకాంత్‌


బస్సును ఢీకొట్టిన ఆటో

హవేళిఘణాపూర్‌(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలిలా.. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లికి చెందిన సంపంగి శ్రీకాంత్‌(25), కాడిపల్లికి చెందిన వడ్డె నరేశ్‌(24) కలిసి మెదక్‌ వైపు ఆటోలో వెళ్తున్నారు. నర్సాపూర్‌–మెదక్‌ జాతీయ రహదారిపై మెదక్‌ మండలం మంభోజిపల్లి నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ సమీపంలో బైక్‌ను ఓవర్‌టెక్‌ చేయబోయి ఎదురుగా సికింద్రాబాద్‌ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న శ్రీకాంత్‌ కిందపడిపోగా, పక్కనే కూర్చున్న నరేశ్‌ ఆటోలోనే చిక్కుకొని అక్కడికక్కడే ఇద్దరు చనిపోయారు. ఘటన స్థలానికి చేరుకున్న మెదక్‌రూరల్‌ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ మురళి వివరాలను సేకరించారు. మృతదేహాలను మెదక్‌ మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడు శ్రీకాంత్‌కు భార్య పూజ, ఇద్దరు కుమారులు ఉన్నారు. నరేశ్‌ ఏకైక కుమారుడు కావడంతో వారి తల్లిదండ్రులు బోరున విలపించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం


గుండారెడ్డి

జహీరాబాద్‌: వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈఘటన మండలంలోని రంజోల్‌ గ్రామంలో చోటు చేసుకుంది. రూరల్‌ పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గుండా రెడ్డి(30) జూన్‌ 18న ఉదయం కారు డ్రైవింగ్‌కు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద కుటుంబ సభ్యులు వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. సోమవారం అతడి అన్న శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నర్సాపూర్‌ పట్టణంలో వృద్ధుడు


మల్లయ్య

నర్సాపూర్‌ రూరల్‌: వృద్ధుడు అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణంలోని సునీతా రెడ్డి కాలనీకి చెందిన ఎర్రోళ్ల మల్లయ్య (75) అనే వృద్ధుడు ఈ నెల 27న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మల్లయ్య కుమారుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ప్రమాదంలో భార్య మృతి
- భర్తకు తీవ్రగాయాలు


స్వప్న

తూప్రాన్‌ /మనోహరాబాద్‌(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పట్టణ సమీపంలో సోమవారం చేసుకుంది. ఎస్‌ఐ వివరాల ప్రకారం... మనోహరాబాద్‌ మండలం కూచారం గ్రామానికి చెందిన దాసరి రమేశ్‌, స్వప్న(29) దంపతులు యాక్టీవాపై చేగుంట మండలం మక్కరాజ్‌పేటలో స్వప్న పెద్దనాన్న ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆదివారం వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి వస్తున్న క్రమంలో 44వ జాతీయ రహదారిపై మాసాయిపేట స్టేషన్‌ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో స్వప్న అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రమేశ్‌ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలసదనంలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న న్యాయమూర్తి మిలింద్‌ కాంబ్లే

సిద్దిపేటజోన్‌: జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని సోమవారం ప్రిన్సిపాల్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి, జిల్లా లీగల్‌ సర్వేసెస్‌ అథారిటీ ఇన్‌చార్జి సెక్రటరీ మిలింద్‌ కాంబ్లే సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లల యోగ క్షేమాల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. భోజన నాణ్యత, పరిసరాలను ,ఆహార నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

బిల్లులు ఇవ్వడం లేదని ట్రాక్టర్లు తీసుకెళ్లాడు

మండలంలోని దుద్దెడలో ఘటన

కొండపాక(గజ్వేల్‌): చేసిన పనులకు డబ్బులు ఇవ్వడం లేదని గ్రామ పంచాయతీకి చెందిన రెండు ట్రాక్టర్‌లను తీసుకెళ్లిన ఘటన కొండపాక మండలంలోని దుద్దెడలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జక్కుల మల్లేశం సుమారు గత రెండున్నర ఏళ్ల కిందట గ్రామ పంచాయతీకి సంబంధించిన పలు పనులు జేసీబీ, ట్రాక్టర్‌లతో చేశాడు. ఈ పనులకు గాను సుమారు 2.20లక్షల వరకు రావాల్సి ఉంది. డబ్బులు ఇవ్వాలని పలు మార్లు తాజా మాజీ సర్పంచ్‌, పంచాయతీ కార్యదర్శిని అడిగినా ఫలితం లేదు. దీంతో గ్రామ పంచాయతీకి చెందిన రెండు ట్రాక్టర్‌లను తీసుకెళ్లాడు. తాను చేసిన పనులకు బిల్లులు చేసుకొని వాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి చక్రపాణిని అడగగా తాను లేనప్పుడు జరగవచ్చని, పనులు జరిగిన విషయం తన దృష్టిలో లేదన్నారు. ట్రాక్టర్‌లను తీసుకెళ్లిన విషయం వాస్తవమేనని త్రీటౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

ఖాజాపూర్‌లో పోలీస్‌ పికెటింగ్‌

కల్హేర్‌(నారాయణఖేడ్‌): సిర్గాపూర్‌ మండలం ఖాజాపూర్‌లో సోమవారం పోలీస్‌ పికెటింగ్‌ ఏర్పాటు చేశారు. భూ తగాద కారణంగా గ్రామానికి చెందిన కార్పట్ల జైపాల్‌(35) ఆదివారం దారుణ హత్యకు గురైన విషయం విధితమే. కుర్మ రమేష్‌ తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గొడవలు జరగకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగల్‌గిద్ద ఎస్‌ఐ బి.సాయిలు ఆధ్వర్యంలో పోలీసు పికెటింగ్‌ కొనసాగుతుంది. జైపాల్‌ హత్య పట్ల దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

స్నాతకోత్సవానికి వేళాయె..

- కార్యక్రమానికి హాజరుకానున్న గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ
- పట్టాలు అందుకోనున్న 267 మంది విద్యార్థులు

నేడు కొండా లక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం సంబురాలు



ములుగులోని కొండా లక్ష్మణ్‌ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం


విశ్వవిద్యాలయం ప్రధాన ముఖ ద్వారం

ములుగు(గజ్వేల్‌): నిత్యం విద్యార్థులు వివిధ అధునాతన పరిశోధన అంశాలపై సందడిగా కనిపించే సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నాలుగో స్నాతకోత్సవ సంబురానికి సిద్ధమైంది. మంగళవారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో స్నాతకోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ, పటాన్‌చెరు ఇక్రిసాట్‌ డైరెక్టర్‌ జనరల్‌ హిమాన్షు పాఠక్‌ హాజరు కానున్నారు.

2014లో విశ్వవిద్యాలయం ఏర్పాటు

శ్రీ కొండా లక్ష్మణ్‌ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) 2014లో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేశారు. 2019లో సిద్దిపేట జిల్లాలోని ములుగులో అప్పటి సీఎం కేసీఆర్‌ చేతులమీదుగా ప్రారంభమైంది. ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూకు అనుబంధంగా రాష్ట్ర వ్యాప్తంగా 10 పరిశోధన స్థానాలు, 4 బోధన కళాశాలలు, ఒక కృషి విజ్ఞానకేంద్రం, మూడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఏర్పాటు చేసిన ఈ విశ్వవిద్యాలయం తనదైన శైలిలో ఇప్పటికే అనేక విజయాలను సాధించింది. విద్యాబోధన, విస్తరణ పరిశోధన రంగాల్లో విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీలు, ప్రభుత్వ , ప్రైవేట్‌ సంస్థలు, శాస్త్రీయ సంస్థలతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుని ముందుకు సాగుతున్నారు. ఉద్యాన విద్య, విస్తరణ పరిశోధనలకు ఆదరణ పెరుగుతోంది. ఈ రంగంలో అపారమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉండటంతో అధిక శాతం విద్యార్థులు ఉద్యాన బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

నాలుగో స్నాతకోత్సవం

విశ్వవిద్యాలయ మొదటి స్నాతకోత్సవం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. రెండో స్నాతకోత్సవాన్ని ములుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో, మూడో స్నాతకోత్సవాన్ని ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం ఆడిటోరియంలో చేశారు. నాలుగో స్నాతకోత్సవాన్ని రాజేంద్రనగర్‌లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో 267 మంది విద్యార్థులు గవర్నర్‌ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా డిగ్రీ పట్టాలను అందుకోనున్నారు. అందులో 158 మంది బ్యాచిలర్స్‌ ఆఫ్‌ హార్టికల్చర్‌, 55 మంది బ్యాచిలర్స్‌ ఆఫ్‌ ఫారెస్ట్రీ, 38 మంది మాస్టర్స్‌ హార్టికల్చర్‌, 11 మంది మాస్టర్స్‌ ఫారెస్ట్రీ, 5 మంది పీహెచ్‌డీ హార్టికల్చర్‌ విద్యార్థులకు పట్టాలు అందజేయనున్నారు. అలాగే 13 మందికి గోల్డ్‌ మెడల్స్‌ను ప్రదానం చేయనున్నారు.

ఏర్పాట్లు చేశాం



రాజేంద్రనగర్‌ ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నాలుగో స్నాతకోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశాం. 267 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేయనున్నాం. రోజురోజుకు పెరుగుతున్న ఉద్యాన పంటల విస్తీర్ణం నేపథ్యంలో విద్యార్థులకు ఈ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉంది. విశ్వవిద్యాలయంలో పరిశోధనల(రీసెర్చ్‌)లో విస్తృత అవకాశాలున్నాయి. విశ్వవిద్యాలయానికి సమీపంలో ఉన్న కొట్యాల బోధన కళాశాలలో వాణిజ్య పరమైన ఉద్యాన పంటల మోడల్‌ ఉద్యాన క్షేత్రాన్ని ఏర్పాటు చేయనున్నాం. ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది.

–డాక్టర్‌ దండా రాజిరెడ్డి, విశ్వవిద్యాలయం, వైస్‌ ఛాన్స్‌లర్‌